
# పిచ్చమ్మాల

## వాసిరెడ్డి సీతాదేవి



విశాఖపట్నం క్యాంప్ అంటే నాకు చాలా ఇష్టం. ఆ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ అంటే ఇంకా ఇష్టం. రాత్రిళ్ళు ఆ గెస్టుహౌస్ వరండాలో నిల్చుని, రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో ఆ నగర శోభను చూడడం - అదొక థ్రిల్లింగ్ అనుభవం. వజ్రవైఢూర్యాలు పొదిగిన నగలు - టెక్నికలర్ నైలాన్ వలువలు - ధరించిన ఒక మహా సౌందర్యవతిలా కన్పిస్తుంది. మనసు భరించలేని సౌందర్యం అది. అంతే కాదు. అక్కడి రచయిత లంటే ఇష్టం. ముఖ్యంగా రా.వి. శాస్త్రి గారి మాటలు వినడం మరీ మరీ ఇష్టం. అందుకే అవకాశం వస్తే చాలు వదులు కోకుండా విశాఖపట్నం టూర్ వేసుకొనేదాన్ని.

ఆ రోజు నన్ను రిసీవ్ చేసుకోవడానికి రైల్వేస్టేషన్‌కు వచ్చిన యూత్ కో- ఆర్డినేటర్, నాగేశ్వరరావుగారు తనతో వున్న యువతిని పరిచయం చేస్తూ "మేడం! ఈమె కొత్తగా అపాయింట్ అయిన యూత్ ఆర్గనైజర్" అన్నాడు.

"నీ పేరేమిటమ్మా!"

"కల్పన"

"ఒట్టి కల్పనవు కాదు. ఒక మహాకవి కల్పనలా వున్నావు" అన్నాను. ఆ అమ్మాయి అందమైన ముఖంలోకి చూస్తూ. ఆ అమ్మాయి నుంచి ఎలాంటి రెస్పాన్సూ లేదు. ఆ పెద్ద పెద్ద కళ్ళల్లో ఏదో విషాదం కొట్టొచ్చినట్టుగా కన్పించింది. తన సర్వస్వాన్ని మోసుకొస్తున్న నావ, నట్టనడి సముద్రంలో మునిగిపోయినట్టుగా ముఖంలో విచారం - ప్రపంచంలోని కష్టాలన్నీ కట్ట కట్టుకొని వచ్చి ఆమె భుజాల మీద కూర్చున్నట్టుగా ఆ వంగి నిలబడిన తీరూ - సమ్‌థింగ్ ఈజ్ రాంగ్ విత్ హర్ అన్పించింది.

ప్లాట్‌ఫారం మీద పక్కగా నడుస్తున్న కల్పనను అడిగాను "నీ వయసెంత?"

"ఇరవై రెండు"

ఇరవై రెండేళ్ళకే ఎన్ని సమస్యలున్నా ఇంత నీరసించి పోవాలా! ఇలాంటి ఆడపిల్లల్ని చూస్తుంటే నాకు చిరాకు కలుగుతుంది.

కారులో వెనకసీట్లో నా పక్కన కూర్చుంది. యూత్ కో-ఆర్డినేటర్ ముందు సీటులో కూర్చుని వెనక్కు తిరిగి ఆఫీసు విషయాలు చెబుతున్నాడు. నేను శ్రద్ధగా వింటున్నాను. మధ్య మధ్య పక్కనుంచి దీర్ఘ నిట్టూర్పులు విన్పిస్తున్నాయి. తల తిప్పి చూశాను. కల్పన జబ్బు ఏమిటో అప్పుడు నాకు అర్థం అయింది. పెద్ద పెద్ద నిట్టూర్పులే విడుస్తోంది. జబ్బు బాగా ముదిరిపోయినట్టే వుంది. బాబోయ్! మూడు రోజులు నేను ఈ నిట్టూర్పుల్ని భరించాలా?

"ఏమిటి మేడం! ఆలోచిస్తున్నారు?" నాగేశ్వరరావు ప్రశ్న.

"ఆc! ఏంలేదు. ఇవ్వాళ ప్రోగ్రాం ఏమిటి?"

"లోకల్‌యూత్ క్లబ్స్ విజిట్స్. రేపు ఉదయం ఎనిమిది గంటలకు బయలుదేరి సబ్బవరం వెళ్తున్నాం."

"సరే! భారతి ఎలా వుంది?"

"బాగుంది. మిమ్మల్ని చూడాలంటున్నది."

ఆరోజు అఫీషియల్ విజిట్స్ ముగించుకొని గెస్ట్‌హౌస్‌కు వచ్చేసరికి కల్పన మా కోసం ఎదురుచూస్తూ వుంది. ఆ అమ్మాయిని గురించి కొన్ని విషయాలు తెలుసుకుందామనుకున్నాను. కాని సమయం దొరకలేదు.

"నేను రేపు ఉదయం 8 గంటలకు వస్తాను." నాతో అని కల్పన వైపు చూశాడు. "మేడం గారికి ఏం కావాలో చూసుకో ఏడుస్తూ కూర్చోకు." అని హెచ్చరించి వెళ్ళిపోయాడు ఆఫీసర్.

"భోజనం వడ్డించమంటారా మేడం!"

"నువ్వుకూడా పద. ఇద్దరం తిందాం."

"నేను... నేను తర్వాత..."

"అదేం కుదరదు. పద ఇద్దరం భోజనం చేద్దాం."

భోజనం చేసి వరండాలో కుర్చీలో కూర్చున్నాను. నా ఎదురు కుర్చీలో కల్పన ముడుచుకుపోతూ కూర్చుంది. మధ్య మధ్య నిట్టూర్పులు విడుస్తున్నది. చిన్నగా మాటల్లో పెట్టి ఆ అమ్మాయి బెరుకుపోగొట్టాను. వాళ్ళ కుటుంబ విషయాలు కొన్ని తెలుసుకున్నాను. కల్పన తండ్రి హైస్కూలు హెడ్‌మాస్టర్. ఇద్దరు ఆడపిల్లలు - ఒక మగపిల్లవాడు. తండ్రి ఆడపిల్లల్ని కూడా మగ పిల్లవాడితో పాటు చదివిస్తున్నాడు.

"మరి బి.ఏ.తో చదువెందుకు ఆపేశావ్? మీ నాన్న పెళ్ళి చెయ్యాలనుకొంటున్నారా? అందుకే ఆపించేశారా?"

"మా నాన్నగారు ఆపించలేదు. నన్ను ఎం. ఏ. చదవమని బలవంతపెట్టారు."

"మరి!"

"నేనే చదవనన్నాను." అంటూ మళ్ళీ నిట్టూర్పు విడిచింది.

"ఎందుకని?"

"చదవాలనిలేదు."

"పెళ్ళిచేసుకోవాలని వుందా?"

కల్పన నా ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా "నేనొక కథ చెప్తాను. రాస్తారా?" అంది.

నేను ఒక క్షణం ఆమె ముఖంలోకి పరిశీలనగా చూసి " ఎవరి కథ?" అన్నాను.

"నా స్నేహితురాలి కథ."

"కాదు. నీ కథే!"

నా మాటకు కల్పన తృళ్ళిపడింది. గాభరా పడింది.

"మీకు నా కథంతా తెలిసిపోయిందా మేడం! నాగేశ్వరరావుసార్ చెప్పారా?"

"నాకెవరూ చెప్పలేదు. నువ్వే చెప్పావ్?"

"నేనా?" ఆశ్చర్యంగా చూసింది.

"అవును నువ్వే! మాటల్లో కాదు - నిట్టూర్పుల్లో చెప్పావు. నువ్వు ఎవర్నో ప్రేమిస్తున్నావ్.

చెప్పడానికేముంటుంది? అన్ని ప్రేమకథలూ ఒకలాగే వుంటాయి."

"నా ప్రేమ కథ అందరి ప్రేమకథల్లాంటిది కాదు."

నేను అలా అన్నందుకు బోలెడంత బాధపడిపోతూ అంది.

"తరతరాల ప్రేమకథలు - అదే దగాపడిన ఆడపిల్లల కథలు వింటూనే వుంటారు. అయినా ప్రేమలో పడిన ప్రతి ఆడపిల్లా, తన ప్రేమకథ అందరి ప్రేమకథల్లాంటిది కాదని భావిస్తుంది. తను ప్రేమించిన వాడు అందరు మగవాళ్ళలాంటివాడు కాదని నమ్ముతుంది. చాలా వరకు అన్ని ప్రేమ కథల ముగింపు ఒకటిగానే వుంటుంది. నీ దృష్టిలోనే" ఆగి ఆ పిల్ల ముఖంలోకి చూశాను.

"అవును. నా రవి, అందరిలాంటివాడు కాదు. చాలా మంచివాడు."

"అతను అంత మంచివాడా? పేరు కూడా బాగుంది. మరి! అయితే అంత పెద్ద పెద్దవి ఎందుకు తీస్తున్నావ్?" నా కంఠంలో పలికిన వ్యంగ్యం నాకే అదోలా విన్పించింది.

కల్పన నా ముఖంలోకి అయోమయంగా చూసింది.

"అర్థం కాలేదా?"

"కాలేదు" అన్నట్టుగా తల ఆడించింది.

"అతనంత మంచివాడైతే అంతంత పెద్ద పెద్ద నిట్టూర్పులు ఎందుకు లాగుతున్నావా అన్నది నా సందేహం!"

కల్పన సమాధానం ఇవ్వలేదు. ఆ పెద్ద పెద్ద కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది. చెంపలు తడుస్తున్నాయి.

"అరే ఏడుస్తున్నావా? సారీ! నిన్ను బాధ పెట్టాననుకుంటాను ప్లీజ్! ఏడవకు. కళ్ళు తుడుచుకో." లాలనగా అన్నాను.

పర్సు తెరిచి రుమాలు తీసుకుంది. ఆ రుమాలుతోపాటు ఏదో వస్తువు ఎగిరివచ్చి నా కళ్ళముందు పడింది. గచ్చు మీద పడడంతో తమాషా శబ్దం విన్పించింది. నేను చటుక్కున వంగి ఆ వస్తువుని తీసుకున్నాను. చూశాను. చూస్తూనే వుండిపోయాను. ఒక్కసారిగా కల్పన దాన్ని నా చేతి నుంచి గుంజుకున్నట్టుగా తీసుకుంది. కళ్ళకు అద్దుకొని పర్సులో పెట్టుకుంది. నేను తెల్లముఖం వేసి చూస్తూ వుండిపోయాను. ఆ పిల్ల నేల చూపులు చూస్తూ కూర్చుంది.

"మాంగల్యం పర్సులో . పెట్టుకొని తిరుగుతున్నావేమిటి? అతడు కన్పిస్తే కట్టించుకోవాలనేనా? ఈ మధ్య ముఖం చాటేసి తిరుగుతున్నాడా?"

"ఆయన అలాంటివాడు కాదు. ఇది ఆయన కట్టిన తాళే."

"అతను కట్టిన తాళా? మరైతే పర్సులో పెట్టుకు తిరుగుతున్నావేం?" ఆశ్చర్యంలో తలమునకలైపోతూ అడిగాను.

"లోకం దృష్టిలో ఇంకా నేను కన్యనే మేడం!" నాకు జుట్టు పీక్కోవాలనిపించింది.

"తల్లీ! ఈ సస్పెన్సుతో నన్ను చంపకు. నీ కథ చెప్పు. వింటాను." ఓడిపోయిన సిపాయిలా అన్నాను.

"విని నా కథ రాస్తారుగా మేడం?"

" ఆ సంగతి ఇప్పుడే చెప్పలేను. ముందు నీ కథ చెప్పు."

" నేను బి. ఏ. ఫైనల్ ఇయర్‌లో వుండగా రవితో పరిచయం అయింది. అతను యూనివర్సిటీలో రీసెర్చి స్కాలర్. రెండేళ్ళుగా భార్యాభర్తలుగానే వుంటున్నాం. ఒక అబార్షన్ కూడా అయింది."

"అబార్షన్ అయిందా? చేయించుకున్నావా?"

"చేయించుకున్నాను."

"కారణం? నీకు పిల్లలంటే ఇష్టం లేదా?"

"చాలా ఇష్టం."

"మరైతే ఎందుకు అబార్షన్ చేయించుకున్నావ్"

"చెప్పానుగా లోకం దృష్టిలో ఇంకా నేను కన్యనేనని..."

"భార్యాభర్తలుగా కలిసి జీవిస్తున్నాం అని అన్నావుగా?"

"కలిసి జీవించడంలేదు."

"అంటే ఎవరికీ తెలియకుండా రహస్యంగానా?"

"అవును. రిసెర్చి పూర్తి అయేంతవరకే ఇలా. ఆ తర్వాత రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుందామని నిర్ణయించుకున్నాం."

"మధ్యలో ఈ మాంగల్యం కథేమిటి రామాయణంలో పిడకలవేటలా?" కొరుకుడు పడని పజిల్‌లా వుంది కల్పన ప్రేమకథ.

"ఈ మధ్యనే మాంగల్యం ఇద్దరు స్నేహితుల సమక్షంలో ఆయన నా మెళ్ళో కట్టారు."

"అదే ఎందుకంటున్నాను."

కల్పన కొద్ది క్షణాలు మౌనంగా వుంది. మళ్ళీ కళ్ళలో నీరు తిరిగింది.

"ఆరు నెలల క్రితం ఇంటి నుంచి టెలిగ్రాం వచ్చిందని ఆయన ఊరికి వెళ్ళాడు. పదిహేను రోజుల తర్వాత తిరిగి వచ్చాడు. ఇద్దరం మామూలుగానే తిరుగుతున్నాం. కాని రవిలో మునుపటి ఉత్సాహం కన్పించలేదు. ఏదో ఆలోచిస్తూ వుండేవాడు. ఎంత అడిగినా "ఏమీలేదు. బాగానే వున్నానుగా?" అని మాత్రం సమాధానం ఇచ్చేవాడు. మధ్య మధ్య ఊరికి వెళ్ళడానికి కారణం అడిగితే మాటదాటేసేవాడు. రెండు నెలల క్రితం ఒకరోజు. మేము మామూలుగా కలుసుకునే ప్రదేశంలో రవికోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. రవి స్నేహితుడు అప్పారావు వచ్చాడు. నీకో ముఖ్యమైన విషయం చెప్పాలని వచ్చానన్నాడు. "నీ ప్రియుడ్ని వాడు చెప్పమంటేనే వచ్చాను." అన్నాడు. అదే సమయంలో రవి వచ్చాడు. అప్పారావు చెప్పింది నిజమేనన్నాడు.

నాకు ఆ మాట వినగానే ఏదో అయిపోతున్నట్టూ, ఎక్కడికో... అగాథంలోకి పడిపోతున్నట్టూ అన్పించింది. 'కెవ్వు'న అరిచినట్టుగా గుర్తుంది." అని కొద్ది నిముషాలు ఆగి దీర్ఘ నిట్టూర్పు తీసింది.

"మరి! రవి అందరి లాంటి మగవాడు కాదన్నావుగా?"

"పూర్తిగా వినండి మేడం!"

" ఊఁ చెప్పు!"

"నేను కళ్ళు తెరిచి చూసేసరికి నా తల రవి ఒళ్ళో వుంది. అతని ముఖం ఎంత విచారంగా వుందనుకున్నారు? "నన్ను క్షమించు కల్పనా! ఈ పెళ్ళి నా తల్లిదండ్రుల బలవంతంతో చేసుకున్నాను" అన్నాడు మేడం.

" ఏడవలేకపోయాడూ!"

"పాపం! ఏడ్చాడు మేడం. వెక్కి వెక్కి ఏడ్చాడు."

"అయ్యో! పాపం వెక్కి వెక్కి ఏడ్చాడా! బావురుమని ఏడవలేదూ?" నా కంఠంలో పలికిన వ్యంగ్యాన్ని కూడా గుర్తించే స్థితిలో లేదు ఆ పిల్ల.

"అవును మేడం! భోరు భోరున ఏడ్చాడు. నాకు జాలి వేసింది. ఓదార్చాను. అతని బాధ చూస్తుంటే నాకూ ఏడుపు వచ్చింది."

"నాకూ ఏడుపు వచ్చేలాగుంది. ఇక ఆపు!" అని అరవాలనిపించింది.

" ఏం మేడం! మీకు విసుగ్గా వుందా?"

"లేదు. లేదు. చెప్పు."

"తనను క్షమించమని వేడుకున్నాడు. నా మనసు కరిగిపోయింది. బాధపడకు రవీ! నన్ను నీ ఉంపుడుగత్తెగానైనా స్వీకరించు. జీవితాంతం నీతో బతికే అవకాశం ఇవ్వు. నన్ను నీ మనిషిగా పదిమంది ముందూ స్వీకరించు. అంతేచాలు" అని ప్రాధేయపడ్డాను. అందుకు రవి వెంటనే అంగీకరించాడు. అయితే కొంతకాలం ఓపిక పట్టాలన్నాడు. రీసెర్చి పూర్తి అవగానే ఎలాగయినా తన భార్యను ఒప్పించి నన్ను తనదానిగా పదిమందిలో స్వీకరిస్తానన్నాడు. అంతవరకూ మన వ్యవహారం రహస్యంగానే వుండాలన్నాడు. వెంటనే నా మెళ్ళో ఆ మూడుముళ్ళూ వెయ్యాల్సిందేనని పట్టుపట్టాను. రహస్యంగానైనా సరే అన్నాను. ఆ మూడు ముళ్ళూ వేశాక ఎంత కాలమైనా - నన్ను పదిమంది ముందూ తన మనిషిగా...'

" ఉంపుడుగత్తెగా..." మధ్యలోనే అందుకొని అన్నాను.

"అవును! మేడం! ఎంతకాలమైనా వేచి వుంటానని చెప్పాను. అతను మాంగల్యం కట్టడానికి ఒక పట్టాన అంగీకరించలేదు. నేను ఏడ్చాను. గోలచేశాను. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాను. చివరకు ఒప్పుకున్నాడు. తన స్నేహితులు ఇద్దరి ముందు కట్టడానికి" అని ఆగి మరో నిట్టూర్పు విడిచింది.

" ఊఁ చెప్పు! ఆగిపోయావేం? ఏ రహస్య ప్రదేశంలో కట్టాడు ఆ తాళి!"

"బీచిలో - నా కోరిక మేరకు...'

"బీచిలోనా - అదీ నీ కోరికా...?"

"అవును మేడం. మా పరిచయం అయింది విశాఖ బీచిలోనే... అందుకే..."

' ఆఁ అర్థం అయింది. ఆ తాళి బొట్టు అతడే చేయించుకొని వచ్చాడా?"

"లేదు. నేనే చేయించుకున్నాను."

"ఆ నూలు తాడూ... ఆ పసుపూ కూడా నీదేనా?"

వళ్ళు మండిపోయి అన్నాను.

చాలా మామూలుగా "అవును మేడం" అంది.

నాకు ఆ పిల్ల అమాయకత్వం మీద జాలి కలగడంలేదు. కోపం వస్తున్నది.

"అతను మొదటిసారిగా బీచిలో పరిచయం అయ్యాడా? ఎలా?"

"రెండేళ్ళయింది. వేసవి కాలం. నేను, నా స్నేహితురాలు సుశీలతో కలసి బీచికి వెళ్ళాను. బీచిలో కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం. ఐస్ ఫ్రూట్ తింటూ యువజంటల్ని చూస్తూ జోక్స్ వేసుకుంటున్నాం. అదే సమయంలో ఇద్దరు యువకులు మా దగ్గరకు వచ్చారు. "మీరేతింటారా? మాకివ్వరా?" అన్నాడు రవి నన్ను

చూస్తూ. నేను తింటున్న ఐస్ ఫ్రూట్ అతనికి అందించాను. సుశీల...."

"మోహన్‌కు అందించిందా?" మధ్యలో అందుకుని అన్నాను.

''మోహానా? అతనిపేరు మోహన్ కాదు. సన్యాసిరావు."

"అతనిపేరు మోహన్ అయితే ఇంకా బాగుండేది?"

"నాకు అర్థం కాలేదు."

"నీకు అర్థం కాదులే. సరే చెప్పు. ఆ తర్వాత? సుశీలా, మోహన్‌లు కూడా ప్రేమించుకున్నారా?"

"సారీ మేడం! సన్యాసిరావు - అవును. మేము నలుగురం రోజు కలిసి తిరిగేవాళ్ళం.

"ఒకవేళ రవికి బదులు సన్యాసిరావు నీ ఐస్ ఫ్రూట్ తిన్నాడనుకో... అప్పుడు నువ్వు...?

"సన్యాసిరావునే ప్రేమించేదాన్ని"

ఆ సమాధానానికి నాకు తల తిరిగిపోయినట్టుగా అన్పించింది.

పిచ్చమ్మలు! పిచ్చమ్మలు! మనసులోనే కసిగా అనుకున్నాను.

ఈ పిల్ల బి. ఏ. పాసయిందా? కల్పన ముఖంలోకి వెర్రి చూపులు చూశాను.

"సుశీలా-మోహన్-సారీ సన్యాసిరావూ - పెళ్ళి చేసుకున్నారా?

"లేదు." అంటూ నిట్టూర్పు విడిచింది.

"ఏం పాపం! ఆ మోహన్ సుశీలను మోసం చేశాడా?"

"లేదు మేడం. పాపం సన్యాసిరావును మోసం చేసి, సుశీల వాళ్ళ నాన్న చూసిన సంబంధం - కిక్కురుమనకుండా చేసుకొని అత్తవారింటికి వెళ్ళిపోయింది."

"చాలా మంచిపని చేసింది. చాలా తెలివైన పిల్ల. నువ్వూ అదే చెయ్యి."

"అదెలా! సుశీల మనసు మాత్రమే..."

"పారేసుకుందా?" మధ్యలోనే అందుకున్నాను.

"అవును మేడం! కాని నేను..."

మనసుతోపాటు శీలం కూడా పారేసుకున్నావు!"

"అవును. మేడమ్!"

"మరి నీతోపాటు నీ ప్రియుడూ పారేసుకున్నాడుగా శీలం? అతడు పెళ్ళి చేసుకున్నాడుగా? మరి నువ్వెందుకు చేసుకోకూడదు?"

"అదీ ఇదీ ఒకటి ఎలా అవుతుంది మేడం! అతను మగవాడు"

" ఏం? ఎందుకు కాదూ! మగవాడికి శీలం అక్కర్లేదా?

కల్పన ఆలోచిస్తూ వుండిపోయింది. ఆలోచిస్తోంది. పర్వాలేదు అనుకున్నాను.

"ఒకటి చెయ్!" ఆలోచనలో పడింది. ఆ ఆలోచనను కొనసాగించాలనే అన్నాను.

"చెప్పండి."

"వెళ్ళి ఆ తాళి వాడి మొహానకొట్టు?"

కల్పన తృళ్ళిపడి నా ముఖంలోకి, నేనేదో అనరాని మాట అన్నట్టుగా చూసింది.

"ఆc! మర్చేపోయాను. ఆ బంగారం నీదేగా? తాడూ పసుపూ కూడా నీదేనాయె. ఆ బంగారం నువ్వే అమ్మేసుకో. ఇక వాడి ముఖం చూడకు."

నేనేదో అనరాని మాట అన్నట్టుగా నాకేసి చూసింది.

"మాంగల్యం పవిత్రమైంది. స్త్రీకి ఐదోతనం..."

"స్టాపిట్!" దాదాపు అరిచినట్టే అన్నాను.

కల్పన బిత్తరపోయి నా ముఖంలోకి చూసింది. నా ఆవేశాన్ని అదుపులో పెట్టుకొని అనునయంగా చెప్పడానికి ప్రయత్నించాను.

"చూడు కల్పనా! తాళి - పవిత్రతా - పాతివ్రత్యం - శీలం - ఐదోతనం..."

"సారీ! మేడం! నా నమ్మకాలు నాకున్నాయి."

చివ్వున తలెత్తి చూశాను. లాభంలేదు. ఇప్పుడు నేను ఒక పెద్ద లెక్చరు ఇచ్చినంత మాత్రాన ఆమె ఆలోచనలు మారతాయని నాకు అనిపించలేదు. అందుకే ధోరణి మార్చాను.

"చూడు కల్పనా! నీ నమ్మకాలను నేను ఎద్దేవా చెయ్యడం లేదు. నువ్వనుకునే మాంగల్యంలోని పవిత్రత నువ్వు కట్టించుకున్న ఈ మాంగల్యానికి లేదు."

కల్పనా అతడు నీ మెళ్ళో కట్టిన ఆ తాడుకు విలువలేదు. చట్టం దాన్ని అంగీకరించదు. భార్యకు విడాకులు ఇవ్వకుండా మరో స్త్రీ మెళ్ళో కట్టే తాడుకు విలువలేదు. ఆ తాడు మెళ్ళో వేసుకొని అతనితో కాపురం పెట్టినా చట్టరీత్యా అతడికి నువ్వు ఉంపుడుగత్తెవే. బాగా ఆలోచించుకో."

"జీవితాంతం - అతడికి ఉంపుడుగత్తెగా వుండడం నాకు ఇష్టమే మేడం. అతడితో అదే చెప్పాను."

నేను అవాక్కయి ఆ పిల్ల ముఖంలోకి చూస్తూ వుండిపోయాను.

"మేడమ్!"

" ఊc" షాక్ నుంచి తేరుకోకుండానే పలికాను.

"నా కథ రాస్తారు కదూ?"

"రాయను. నీ లాంటి పిచ్చమ్మల కథలు రాయను. నీ కథను గ్లామరైజ్ చేసి, ఓ మంచి ప్రేమ కథ చస్తే రాయను. పొద్దుపోయింది. ఇక పద" అంటూ లేచి నిల్చున్నాను.

కల్పన కూడా నిల్చుంది. ఏదో ఆలోచిస్తూ నిల్చుంది.

" ఆలోచించుకో. నువ్వు చదువుకున్న దానివి. నీ గురించి నువ్వే ఆలోచించుకోవాలి. నేను మళ్ళీ వచ్చేసరికి మారిపోయిన కల్పనను చూస్తానని ఆశిస్తున్నాను." అంటూ లోపలకు దారితీశాను.

పడుకున్నాను. నిద్ర రావడంలేదు. ఈ దేశంలో ఇలాంటి పిచ్చమ్మలు కోకొల్లలు. వీళ్ళంతా ఎప్పటికి మారాలి? ఎలా మారాలి! నా బుర్రంతా చెదలపుట్టలా అయింది తెగని ఆలోచనలతో.

